# లైంగికేయుడు

తలుపు జాగర్తగా నెట్టి, పాదం లోపల ఆనించీ ఆనించక ముందే, "రండి! ప్రసాద్‌గారూ!" – అన్నమాట వినపడి ప్రసాద్ నిశ్చేష్టుడయ్యాడు.

ఓ కాలు బయట రెండో'కాలు లోపలా వుంచి, రెండు చేతుల్తో దర్వాజా కమ్ముల్ని గట్టిగా పట్టుకుని, ఆశ్చర్యం ఆనందం మెలివేసుకున్న గొంతుతో, "నా పేరు నీ కెలా తెలుసు?" – అన్నాడు.

ఎదురుగా నుంచున్న పద్మ, పమిటని అవసరమనుకున్నంత పక్కకు లాగి, ఎడం చేతిని వయ్యారంగా గాలిలో ఓ మారు తిప్పి, ఠక్కున గడ్డం కింద ఆనించి, కుడి చేతిని వలయాకారంగా ఆడిస్తూ , "మిమ్మల్ని ఎరగని వాళ్ళూ, మీ పేరు తెలియని వాళ్లూ, యీ ప్రపంచంలో ఎవరున్నారు?" – అన్నది, బిగ్గరగా నవ్వుతూ.

ప్రసాద్ ఆ మాటతో పరవశుడైపోయాడు. తను సంవత్సరం'నుంచి ఏదైతే అనుమానంగా, అస్పష్టంగా అనుకుంటున్నాడో, అది, ఆ నిమిషంలో పచ్చి యదార్థంలా తోచింది. ప్రపంచం అంతా తనని ఎరుగని పద్మ అన్న దాంట్లో కొంత అతిశయోక్తి వున్నదని తీసిపారేసి – ఆ మిగిలేదాన్ని బట్టి లెక్క కట్టినా తన పేరు గ్రామ, తాలూకా, జిల్లా హద్దులు దాటి, కనీసం ఆంధ్ర రాష్ట్రాన్నైనా అలుముకున్నదని తెలుస్తోంది!

"రండి! అలా నుంచున్నారేం? లోపలికి రండి!" – అంటూ పద్మ గట్టిగా చొక్కా పట్టుకున్నప్పుడు, ప్రసాద్ రెండు చేతుల్తో గట్టిగా ఎదురు రొమ్ము హత్తుకుని, తల బాగా వెనక్కి వంచి సూటిగా యింటి కప్పులోకి ప్రళయంగా పెద్ద నవ్వు నవ్వాడు.

"నాకు తెలుసు... నేను అనుకుంటున్నాను... జరుగుతుంది... జరిగి తీరుతుంది... హః!హః !హః!" అంటూ అతడు పద్మ చుట్టూ చేతులు మెలితిప్పి ఆదుర్దాగా ఆమె పెదాల వైపుకు తల వంచాడు.

"ఏమిటా తొందర? తలుపు గడి వేయనీండి!" అంటూ ఆమె పాదరసంలా అతని పట్టు నుంచి తప్పించుకుని పక్కకు వెళ్ళింది.

"ఎందుకా జంకు? ఎవడు చేయంది? ప్రపంచమంతా ప్రేక్షకులుగా వున్నా నేను ఆ పని చేసేందుకు జంకను. నువ్వు యింత స్వతంత్రంగా, స్వేచ్ఛగా – ఆఖరికి స్త్రీ బతకవలసిన విధంగా బతుకుతూ..."

పద్మ కుడిచేత్తో అతడి నోటిని గట్టిగా మూసి, ఎడంచేత్తో తలుపులు దగ్గరగా నెట్టి గడివేసి – "పెద్దగా మాట్లాడబోకండి. పక్క భాగంలో..." అంటూ చేయి వూపింది.

ప్రసాద్ దగ్గిరగావచ్చి, ఆమె చెవి మీద పెదాలు ఆనిస్తూ, "ఎవరు?" - అన్నాడు.

"భార్యాభర్తా! ఏదో సంసారులు"

"అయితే?"

పద్మ, ప్రసాద్ రెండు'చేతులూ పట్టుకుని, పడకగదిలోని పందిరి మంచం దగ్గిరకి గబగబ యీడ్చుకు పోయింది. అతడు మంచం మీద కూర్చోగానే, రెండు చేతుల్తో అతడి రెండు బుజాల్నీ వెనక్కు నెట్టి, వెల్లకిలా పడబోతున్న అతడి పక్కన, వేగంగా తనూపడి, "అయితే ఏమీ లేదు. ఏమన్నా అనుకుంటారు" అంది.

అతడి గుండె గతుక్కుమన్నది. అప్పటి వరకూ ప్రళయ రూపంలో లేచిన వుత్సాహ తరంగాలు, అతణ్నించి తిరోగమించ ప్రారంభించినై. స్వేచ్ఛా స్వతంత్రాల్లో, స్వచ్ఛంగా జీవిస్తున్న ఓ స్త్రీ, తన పేరూ, రూపం కూడా తెలిసివున్న తరుణి, పక్క భాగంలోని దంపతులకి, స్త్రీ పురుషులుగా కాకుండా, భార్యాభర్తలుగా బ్రతికే కుళ్ళు మనుష్యులకి భయపడడం, జంకడం ఆశ్చర్యంగా అనూహ్యంగా, అసందర్భంగా - ఆఖరికి హాస్యాస్పదంగా తోచింది.

అతడి ప్రకృతికీ, జీవితాదర్శానికీ, నమ్మకాలకీ, చివరికి యింగితజ్ఞానానిక్కూడా వ్యతిరేకమైన ఓ అనుమానం, అస్పష్టంగా అతడి మస్తిష్కంలో అలలాగా అటూ యిటూ కదిలింది. బహుశా ఆమె ఏ ఆదర్శం, అభిప్రాయాలూ లేకుండా, కేవలం, డబ్బు కోసమే యీ వృత్తిని స్వీకరించిందేమో!

ప్రసాద్, దగ్గిరగా - యింకా యింకా, దగ్గిరగా జరుగుతూ, ఒరుసుకుంటున్న ఆమెను, చేతి బలం కొద్దీ వారిస్తూ- "అయితే నువ్వు నా పేరు విని వుండవ్" - అన్నాడు.

"మీ పేరు వినడమే కాదు, మీరు రాసిన రెండు నవలలూ, అన్ని కథలూ చదివాను" - పద్మ ఫక్కున నవ్వింది.

ప్రసాద్ తృళ్లిపడిలేచి, పక్క మీద కూర్చున్నాడు.

"అయితే నువ్వు నా కథల్ని తప్పుగా అర్థం చేసుకుని వుంటావ్! లేకపోతే యిది...యిది అసంభవం!" - అతడు తీవ్రంగా ఆమె వంక చూశాడు.

పద్మ గాయపడినదానిలా, పక్క మీద అటూయిటూ ఓమారు పొర్లి, దిండు చాటున తల దాచు కుంటూ - "అదే నేనూ అనుకుంటుంటాను అప్పుడప్పుడూ. కాని అంతా మించిపోయింది, పోయింది..." - ఆమె సన్నగా ఏడవడం ప్రారంభించింది.

ప్రసాద్ హృదయం, ఆమె కంఠం కలిగించే సున్నితమైన విచార ధ్వనికి కరిగి నీరుగా మారింది. పురుషుడి వేడివేడి గుండెనెత్తుర్ని చూచినా కరగని, కదలని అతని గుండెనీ, మెదడునీ స్త్రీ కంటికొలకుల్లోని నీటి బిందువూ, ఆఖరికి బిందు శకలమూ యిట్టే కదిలించి, కరిగించి వేస్తోంది.

"రాణీ! ఎందుకు ఏడుస్తావ్? వేల లక్షల సంవత్సరాలుగా పురుష పశువు గిట్టల కింద నలిగి, పగిలిపోయిన స్త్రీ హృదయ రక్తం వరదలై గంగా, కృష్ణా నదులుగా ప్రవహిస్తోంది. యింకా ఎందుకు వరదలు సృష్టిస్తావ్? నేను... నా వంటి ఒకడూ అరా - నీ కోసం... మీ కోసం..."

ఉద్రేకంతో దగ్గుత్తిక వల్ల యికపైన అతడు మాట్లాడలేకపోయాడు. ఆమె నిండు శరీరాన్ని, గాజు సామాను కంటే జాగ్రత్తగా, సున్నితంగా పట్టుకుని, వుద్రేకంవల్ల కంపించి పోతున్న తన ఎత్తైన వక్షస్థలం మీద చేర్చుకున్నాడు.

"నువ్వు ఏ కారణంవల్ల భర్తను వదలి వేసివచ్చావ్?" – ప్రసాద్ ఆమె చెంపల్ని మునివేళ్ళతో తాకుతూ అడిగాడు.

పద్మ జవాబివ్వలేదు. నిశ్చలంగా అతడి కళ్ళల్లోకి చూస్తూ వూరుకుంది.

"ఏం? నేను వినగూడదా? ఎంతో కాలంగా శక్తినీ, తెలివితేటల్నీ, డబ్బునీ నీబోటి స్త్రీ కోసం అంకితం చేసిన నాకు కాక మరెవరికి చెపుతావ్?" – ప్రసాద్ లాలిస్తూ అడిగాడు.

"మీరు అన్నట్టు మిమ్మల్ని తప్పుగా అర్థంచేసుకుని వుంటాను" – పద్మ మెల్లిగా భయపడుతూ అన్నది.

"ఏదో వొకటి అర్థంచేసుకున్నావ్ – కనీసం నా కథల్ని చదివావ్. అంతేచాలు. ధన్యుణ్ని. ఆ కారణం – నీ భర్తను వదిలి వచ్చిన కారణం, నాతో ఎందుకు చెప్పకూడదు?"

పద్మ అతడి చొక్కా కాలర్ని వేలికి మెలివేసుకుంటూ, "చెపితే–బహుశా మీరు నవ్వుతారేమో!" అన్నది.

"నేనా! నేను! ఆ అనుమానం నీ కెందుకు రావాలి?"

ఆమె ఓ నిమిషం తటపటాయించి, తల పక్కకు తిప్పుకుని అన్నది. '

'మీ కథలు చదివిన కారణం తప్ప నా భర్తను వదలడానికి మరే కారణమూ లేదు"

ప్రసాద్ అనంగీకారంగా నవ్వాడు.

"నువ్వు చెప్పినంత శక్తీ, తీవ్రతా గనక, నా రాతల్లో వున్నట్టయితే – యీ సంవత్సరం నాకు నోబెల్ బహుమతి రావలసింది. నువ్వు హాస్యమాడుతున్నావ్"

"నిజం! ముమ్మాటికీ నిజం! హాస్యం కాదు"

ప్రసాద్ ఆమె ముఖంలోకి ఓమారు చూసి, ఫాలభాగం వేళ్ళతో ఓమారు గట్టిగా రుద్దుకొని, "నీ భర్త ముసలివాడా?" – అన్నాడు.

"కాదు"

"కురూపా?"

"ఉహు!"

"కొడ్తూండేవాడా?"

"లేదు."

"మరి?" – ప్రసాద్ విసుగ్గా లేచి కూర్చున్నాడు – "అయితే ఏకారణంచేత వదిలావ్?"

పద్మ ఓ నిముషం ఆలోచిస్తూ వూరుకుంది. హఠాత్తుగా ఏదో శక్తి పైకి నెట్టినట్టుగా, రక్కున అతని భుజం పట్టుకుని లేచికూర్చుంది.

"మీ లేచిపోయిన స్త్రీ రత్నం అన్న కథలో – కథానాయిక ఏ కారణం వల్ల ఆ పని చేసింది?"

ప్రసాద్ ఏమాత్రం ఆలోచించకుండా జవాబిచ్చాడు – "చాలా పెద్ద కారణం వుంది"

"భర్త ముసలివాడా?"

"కాదు"

"కురూపా"

"ఉహుఁ!"

"కొద్దూుండేవాడా?"

"లేదు"

"మరి ఏ కారణంచేత మీ కథానాయిక భర్తను వదిలేసింది?" – పద్మ విజయ సూచికంగా నవ్వింది.

ప్రసాద్ ఓమారు తల పంకించి, "అప్పుడే, నామీద గెలుపు కలిగినట్టు నవ్వబోకు, పెద్దకారణం వుందన్నాను!" – అన్నాడు.

"అయితే చెప్పండి"

"నువ్వు చెప్పిన ఆ పేరుగల కథ, యిప్పుడే నేను రాస్తున్నంతగా గుర్తువుంది. ఆ కథానాయిక – పెళ్లయిన దగ్గిర నుంచి భర్తతో వారానికి నాలుగుసార్లకు తక్కువ కాకుండా కలుస్తూండేది. ఆ లేచిపోయిన సంఘటన జరిగేముందు, భర్త పొరుగూరు వెళ్ళి పదిహేను రోజులయింది. మరి అలాంటి స్థితిలో పరాయి పురుషుణ్ణి కోరకా, లేచిపోకా ఏం చేస్తుంది?"

పద్మ ఓ నిట్టూర్పు విడిచింది.

"నా విషయంలో కూడా జరిగింది అంతే! మా ఆయన యిల్లు వదిలి ఓ యిరవై రోజుల వరకూ తిరిగి రాలేదు. నేనూ యిల్లు వదిలి యిటు వచ్చేశాను. కాని ఒక సంగతి. అప్పటికే నాకు మీ కథలతో, అందులోని కథానాయికలతో బాగా పరిచయం వుంది"

ప్రసాద్ ఏమాత్రం మాట్లాడలేకపోయాడు. వుక్కిరిబిక్కిరి చేస్తున్న ఆనందం, తన్మయత్వం అతణ్ని నిశ్చేష్టుణ్ణిగా చేసినై. తన కలానికి వున్న వాడి – ఎందువల్లో ఆ సమయంలో అతడికి సెవెన్ ఓ క్లాక్ బ్లేడు క్కూడా లేదన్నట్టుగా తోచింది. పురుషుడి నీడ మీద పడినా బెదిరిపోయి బానిసలుగా తయారయే స్త్రీలు, యిప్పుడిప్పుడే తన రాతల వల్ల మేల్కొంటున్నారు – కాదు తిరుగు బాటు చేస్తున్నారు!

"నేను చేసినపని మంచిది కాదంటారా?" – పద్మ అతడి బుజం పట్టుకుని కదిలిస్తూ ప్రశ్నించింది.

"స్త్రీ ఒకే పురుషుడికి అంటిపెట్టుకుని వుండే నీచకార్యంతప్ప, మరేది చేసినా నేను తప్పనను. ఇరవై రోజులు భార్యను వదిలి అక్కడక్కడా తిరుగుతూంటే – మరి ఆమె అంతకన్న ఏం చేస్తుంది?"

పద్మ నిశ్చింతగా, నిర్వికారంగా పక్క మీద తిరిగి పడుకున్నది.

ప్రసాద్ జేబులోనుంచి ఓ చిన్ననోటు పుస్తకం తీసి ఏదో రాసుకున్నాడు. తిరిగి పుస్తకాన్ని జేబులో పెట్టుకుంటూ, "నీవు లేచిరావడానికి అదొక్కటే కారణం అయి వుండదు. యింకా కొన్ని బలమైన కారణాలు వుండి వుండాలి?" అన్నాడు.

పద్మ అతడి నడుం పట్టుకుని తన వేపుకు లాక్కుంటూ, "అయితే, ఎంతో బలమైన కారణం వుంటే తప్ప, స్త్రీ లేచిపోకూడదని మీ వుద్దేశ్యమా?" అన్నది.

"అది నా వుద్దేశ్యం కాదు. స్వాతంత్ర్యం మానవుడి జన్మహక్కైతే - లేచిపోవడం స్త్రీ జాతి పవిత్ర బాధ్యత. నన్నడిగితే - సరైన కారణం వుండి భర్తను వదిలే స్త్రీ కన్న, ఏ కారణం లేనందువల్లనే భర్తను విడిచే స్త్రీ ధైర్యం గలదీ, ఆదర్శప్రాయమైందీ అంటాను. కారణం అంటూ వుంటే- ఆఖరికి పుట్టుబానిస కూడా తిరుగుబాటు స్వభావాన్ని కనబరుస్తాడు. అందులో గొప్పతనం లేదు!"

పద్మ నవ్వుతూ అతడి చెంప మీద కొట్టి, "అసలు మీరు స్త్రీగా పుట్టినట్టయితే బావుండేది" అన్నది.

ప్రసాద్ ముఖం సీరియస్‌గా పెట్టి, "అవును, అదే నేనూ అనుకుంటుంటాను. పురుషుడిగా కన్న స్త్రీగా జన్మించి వుండినట్టయితే, స్త్రీ జాతికి ఎక్కువ సేవ చేయగలిగి వుండేవాణ్నేమో!"

ఓ రెండు నిమిషాలు యిరువురూ మాట్లాడకుండా వూరుకున్నారు.

చివరికి పద్మ మెల్లిగా అడిగింది.

"మీరు యిల్లు వదిలి ఎన్ని రోజులైంది?"

"దాదాపు నెల"

ఆమె అంతటితో ఆగింది.

ప్రసాద్ ఆమె వంక అనుమానంగా చూస్తూ, "అంతటితో వూరుకున్నావేం?" అన్నాడు.

"ఎందుకులే పోనీండి. మీకు కోపం రావచ్చు?"

"నాకు ఏ పరిస్థితుల్లోనూ స్త్రీల మీద కోపం రాదు. ఆ ప్రశ్న ఎందుకు అడిగావో చెప్పు"

"మీకు పెళ్ళయిందని విన్నాను"

"అవును"

"మీరు యిల్లు వదిలి నెల రోజులై వుంటే - యింటి దగ్గిర మీ భార్య ఏం చేస్తూ వుంటుంది?"

"ఏం చేస్తుంది? మామూలు యింటి పనులే చేసుకుంటూంటుంది"

"కాని, మీ కథానాయికలు ఆ పనుల్తో సరిపెట్టుకునే వాళ్ళు కాదే! స్త్రీలకీ ఆత్మలూ, కోరికలూ, వాంఛలూ అనేవి వుంటవని వొప్పుకుంటారా?"

"ఆ వొప్పుకునే వాళ్ళల్లో నేనే ఆంధ్రదేశంలో మొదటి వాణ్ణీ చివరి వాణ్ణీ కూడా"

"అయితే, మీరు యింటి అన్ని తలుపులకూ బయట తాళం వేసి, తాళం చెవులు వెంట తెచ్చుకున్నారన్నమాట!"

ప్రసాద్ తల గట్టిగా దిండుకేసి కొట్టుకుంటూ, పద్మ భుజం గట్టిగా పట్టుకుని అన్నాడు.

"నీవు ఏం చెప్పదలచుకున్నావో నాకు తెలియడంలేదు"

ఆమె పక్కకు తిరిగి, దృష్టిని దూరంగా గోడ మీద వున్న బొమ్మల వైపుకు సారించి, "మీరు చెప్పేదాన్ని - అంటే రాస్తూండేదాన్ని - ఆచరిస్తూంటారా?"

"నూటికి నూరుపాళ్ళు"

'అయితే - యిప్పుడు మీ భార్య ఏం చేస్తూ వుండాలి?'

ప్రసాద్ జవాబు చెప్పకుండా కళ్లు మూసుకున్నాడు. అలాంటి సందర్భాల్లో తను సృష్టించిన కథానాయికలు ఏం చేసేవారో తనకు తెలుసు! కాని తన భార్యలో, తను జీవం యిచ్చే కథాకాంతల్లో వున్న ధైర్యం, శక్తి, వేడీ, ఉద్రేకం ఏమూలా రవ్వంతైనా లేదు. స్త్రీల మానసిక తత్వాన్ని తను అర్థం చేసుకున్నదే యదార్థమైతే, యీపాటికి శకుంతల పక్క డాబా మీద బలవంతపు బ్రహ్మచర్యాన్ని గడుపుతున్న ఆంజనేయులతో ఆనందిస్తూ వుండాలి.

"కష్టం కలిగిస్తే నన్ను క్షమించండి"'- పద్మ అతడి చెంపల్ని ముద్దాడుతూ భయంగా, దిగులుగా అన్నది.

ప్రసాద్ వణుకుతున్న గొంతుతో, ముఖం మరో వైపుకు తిప్పుకుని అన్నాడు. '"పద్మా! యిక యీ రాత్రికి నన్ను ఏమీ ప్రశ్నించబోకు. నేను దురదృష్టవంతుణ్ని! ఏదో ఒక పవిత్ర సత్యాన్ని నాకు తెలియజేస్తున్నావ్. నన్ను బాగా ఆలోచించనీయ్. యీ రాత్రికి ఇక నేను ఆలోచించడం తప్ప మరేమీ చేయలేను. నీ డబ్బు యిదిగో!"

ప్రసాద్ పర్సు ఆమె చేతిలో పెట్టాడు.

పద్మ అక్కడి నుండి లేచి దూరంగావున్న మరో మంచం మీద పడుకుంది.

అతడు దుప్పటి గడ్డం వరకు లాక్కుని పక్కకు తిరిగి దీర్ఘాలోచనలో మునిగిపోయాడు.

పక్కయింట్లోని గోడ గడియారం ఐదు గంటలు కొట్టేవరకు అతడు ఆలోచిస్తూనే వున్నాడు. అనేక మంది స్నేహితులూ, శత్రువులూ కూడా అనేక సందర్భాల్లో తన రాతల్నీ, అందులోని కథావస్తువుని హేళన చేస్తూ చులకనగా మాట్లాడారు. తను, 'తను సృష్టిస్తున్న కథానాయికలు వనితాలోకంలో సంచలనం కలిగించి, వాళ్ళను అన్ని కట్టుబాట్లూ ధిక్కరించేట్టు చేస్తున్న వనీ, ఆంధ్రదేశంలో వ్యభిచారం వృత్తిగా చేసుకున్న జీవుల్లో మూడు వంతులు తన కథల్ని చదివే అలా భర్తల్ని ధిక్కరించి స్వేచ్ఛగా బ్రతుకుతూ వున్నారు' - అన్నప్పుడు - నాగభూషణం ఏమన్నాడు?....

మంచం దిగుతూ ప్రసాద్ ఓ నిట్టూర్పు విడిచి, 'అవును అనవలసిందే, అన్నాడు' అని గొంతులో గొణుక్కున్నాడు.

'నీ కథల్లోనే అంతశక్తి వుంటే - మొట్టమొదటగా లేచిపోవలసింది నీ భార్య!' - అదీ ఆ నాగభూషణం అన్నమాట!

కాని అలా జరగలేదు. మామూలు స్త్రీలకు మించిన తెలివితేటలూ, అందం - అన్నీ వున్న తన భార్య శకుంతల - ఏమాత్రం తిరుగుబాటు స్వభావం, ఏవగింపు చూపెట్టకుండా రెండు సంవత్సరాల నుంచి ఎలా తనతో కాపురం చేయగలుగుతూ వుందో - తనకే అనుహ్యాంగా వుంది. పైగా తనంటే ఎంతో గౌరవం, ప్రేమా కనబరుస్తుంది.

అందువల్లే అందరూ, 'చెప్పేదానికీ, చేసేదానికీ తేడా వుంటుంది' అని తనను వెక్కిరిస్తున్నారు.

నిశ్చింతగా కదలా మెదలకుండా నిద్రపోతున్న పద్మను ఓమారు చూసి, నిట్టూర్చి, ప్రసాద్ గడపదాటి రోడ్డు మీదికి వచ్చాడు. 'దూరంగావున్న ఓ రిక్షావాడు, ఆత్రంగా అతడి ముందుకు

పరుగెత్తుకొచ్చి, "బాబూ! రిక్షా ఎక్కుతారా?" అన్నాడు.

ఏ జవాబూ యివ్వకుండానే ప్రసాద్ రిక్షా ఎక్కి కూర్చున్నాడు.

తన భార్యను ఎలా ఓ స్త్రీగా, ఆత్మాభిమానం, విభిన్న రుచులూ, ఎప్పటికప్పుడు నూతనత్వాన్నీ, కనీసం మార్పునీ కాంక్షించే స్వేచ్ఛా జీవిగా చేయాలో అతడికి ఎన్ని రకాలుగా ఆలోచించినా - ఓ మార్గం అంటూ కనబడడంలేదు.

రిక్షా దిగి రైలు ఎక్కినప్పుడూ, మళ్ళీ రైలు దిగి రిక్షా మీద తన యింటి వాకిట దిగినప్పుడూ, అతణ్ని అదే ప్రశ్న వెంటాడుతూ పరిష్కారానికి ఎప్పటంత దూరంగానే వుండిపోయింది.

ఇంట్లోకి వెళ్ళి పైపంచ వంకెకు తగిలిస్తూండగా శకుంతల వెనక నుంచి వచ్చి నవ్వుతూ అడిగింది.

"మెయిల్‌కు వచ్చారా?"

"అవును"

ప్రసాద్ ముక్తసరిగా జవాబిచ్చాడు. కాని లోలోపల తొణికసలాడుతూ బైటపడేందుకు అతడిలోని తీవ్రమైన ద్వేషం, అసహ్యం గట్టిగా ప్రయత్నం చేస్తున్నై. రెండు నిమిషాలు కోపాన్ని చిక్కబట్టి, యిక ఆపుకోలేక భార్య వైపుకు తిరిగి, ఎర్రపడ్డ నేత్రాలతో ఆమెను నఖశిఖ పర్యంతం ఓ మారు చూసి, "నేను యింటిలో లేనప్పుడు ఏం చేస్తున్నావ్?" - అన్నాడు.

"ఏం చేస్తాను? మామూలు యింటి పనులే చేసుకుంటున్నాను"

"అవును అంతకంటె నువ్వు చేయగలిగింది ఏమీ లేదు. మంచుముక్క!"

శకుంతల నవ్వుతూ, హాస్యధోరణిలో అడిగింది.

"అంతకన్న చేసేందుకు ఏముంది?"

ప్రసాద్ ముఖం చిట్లించి - గొంగళి పురుగు మీద పాకుతున్నట్టుగా వికార పడుతూ - "నేను కావాలన్న కోర్కె కలగలేదా?" - అన్నాడు.

శకుంతల సాభిప్రాయంగా అతడి వంక ఓమారు చూసి, "కలిగింది! కాని మీరు లేరుగా?" - అన్నది.

"కోర్కెల్నీ, శారీరక అవసరాల్నీ మామూలుగా తీర్చుకునేందుకు అంత జంకూ, భయమూ ఎందుకు?"

"సాధ్యమవుతవనుకున్న కోర్కెల్ని నేనెప్పుడూ దాచిపెట్టుకోనూ లేదు, చంపుకోనూ లేదు" - శకుంతల ప్రతీ అక్షరాన్నీ నొక్కినొక్కి మరీ అన్నది.

"అలా అయితే నా కోసమే కనిపెట్టుకుని కూర్చోకపోతే - ఆ డాబా మీద వున్న యువకుడితో ఎందుకు తీర్చుకోకూడదు?"

శకుంతల అతణ్ని తీవ్రంగా చూస్తూ, "బహుశా మీ కథనాయికలయితే ఆ పని చేసివుండేవారు. నేను మాత్రం అలా చేయలేను"

"అవును. నువ్వో మంచుముక్కవి!"

ఇద్దరూ ఓ ఐదు నిమిషాలు వూరుకున్నారు.

ప్రసాద్ ఏదో తీవ్రమైన వైపరీత్యం హఠాత్తుగా సంభవించిన వాడిలా లేచి – ఆమె దగ్గరకు వెళ్ళి భుజం పట్టుకుని ప్రశ్నించాడు.

"నువ్వు కోరికల్ని, శారీరకోద్రేకాలనీ కావాలని చంపుకుంటున్నావ్. సంఘాన్నీ, నీతుల్నీ చూసి భయపడి మానసిక వ్యభిచారం చేసి తృప్తిపడుతున్నావ్. నీకు చెప్పే ధైర్యమూ, సాహసమూ వుంటే నేనొకమాట అడుగుతాను – యధార్ధమైన జవాబివ్వు!"

"అడగండి!" – శకుంతల నిర్భయంగా అతడి ముఖంలోకి చూస్తూ అన్నది.

"నీకు రోజూ అనేకమైన కలలు వచ్చివుంటై. వాటన్నిటి సంగతీ నా కవసరం లేదు. రాత్రి ఏం కల వచ్చిందో చెప్పు"

"అందువల్ల కలిగే వుపయోగం ఏముంది?"

"వుంది! చాలా వుపయోగం వుంది. బహుశా ఫ్రాయిడ్‌ని నీవు ఎరిగి వుండవు"

"అయితే వినండి. చెపుతాను"

"ఊఁ! కానీ"

శకుంతల, దృష్టిని భర్త మీది నుంచి, పక్కకు తిప్పి ఓ క్షణకాలం ఆలోచించింది. తరువాత నిండు స్వరంతో, నిర్భయంగా అన్నది,

"రాత్రి వచ్చిన కల నాకు చాలా వరకు గుర్తు వుంది. నేను పక్కయింటి వాళ్ళ దొడ్లో వున్న జామచెట్టు కాయల కోసం, మన యింటి కాంపౌండు గోడకు నిచ్చెన వేసి ఆ కాయలు కోసుకునేందుకు గబాగబా ఎక్కాను. యింతలో ఎక్కడి నుంచో హఠాత్తుగా ఓ దున్నపోతు వచ్చి నిచ్చెన్ని కొమ్ములతో పొడవడం ప్రారంభించింది. నేను కిందపడిపోతున్నాననే భయంతో పెద్దగా అరిచాను. అంతలో మెలుకువ వచ్చింది"

ప్రసాద్ విజయ సూచికంగా ఓ నవ్వు నవ్వి, "నువ్వు మానసికంగా ఓ పచ్చి వ్యభిచారిణివి!" – అన్నాడు.

"మీకు మతిపోకపోతే – ఎలాగో చెప్పమని అడుగుతున్నాను"

ప్రసాద్ గడ్డం కింద చేయి పెట్టుకుని ఐదు దీర్ఘ నిమిషాల కాలం దీర్ఘంగా ఆలోచించాడు. తరువాత పెద్దగా నవ్వుతూ గట్టిగా చప్పట్లు కొట్టి, "యిదిగో చెపుతున్నా విను! నీకు డాబా మీద వున్న బ్రహ్మచారితో కాలం గడపాలని వుంది. కాని సంఘం, నీతి, మొదలైన తప్పుడు ఆదర్శాలతో, భయాలతో దాన్ని అణుచుకుంటున్నావ్. కాని ఆ కోర్కె అవ్యక్తావస్థలో నిన్ను వెన్నాడుతూనే ఉంది. నువ్వు పక్క ఇంటి దొడ్లో జామచెట్టు కాయలు అనేది, యిక్కడ పక్క డాబా మీది బ్రహ్మచారి! వ్యక్తావస్థలో అస్పష్టంగా వున్న అతని మీద కోర్కె అవ్యక్తావస్థలో అతణ్ని జామకాయగా మార్చింది! వ్యక్తావ్యక్తావస్థలకి మధ్య వుండే సరిహద్దు బహు యిరుకైంది. ఒక దాని మీద మరోటి ఆ హద్దుల్లో కుస్తీ పడుతూనే వుంటై. నువ్వు జామకాయ రూపం దాల్చిన ఆ యువకుణ్ణి పొందేందుకు తయారయ్యావ్. కాని నువ్వు కల్పించుకున్న నీతినియమాలూ – సంఘం, భర్తా అవన్నీ అక్కడా అడ్డు

వస్తూనే వున్నె. తీరా నువ్వు పొందబోయే సమయానికి సంఘమో, నీతినియమాలో, లేక నేనో - ఆ దున్నపోతు రూపంగా వచ్చి అడ్డుకున్నాం. అక్కడ అవ్యక్తం మీద దొంగదెబ్బ కొట్టి వ్యక్తం గెలిచింది. నువ్వు మేల్కున్నావ్. అంతే!"

శకుంతల ఏమీ మాట్లాడ లేదు. ఓమారు భర్త వంక ఏవగింపుగా చూసి పక్కకు తల తిప్పుకుంది.

"ఇది ఫ్రాయిడ్ చెప్పింది. లేక లైంగికులంతా అర్థంచేసుకునేది. లైంగిక శక్తి అపారమైంది. సూర్యుని చుట్టూ భూమి తిరగడానికి గల కారణం బహుశా యీ లైంగికమే! యీ రెండు గ్రహాలూ తప్పక రెండు విభిన్న లైంగిక శక్తులై వుంటై. కానీ నీ బోటి మంచుముద్దలకు, ఇది అర్థం కాదు. బహుశా హాస్యాస్పదంగా కూడా వుండొచ్చు"

"అయితే యింతకాలంగా మీ రాతల్ని నేను తప్పుగా అర్థంచేసుకున్నానన్నమాట!" - ఆశ్చర్యం కళ్ళల్లో కదులుతూండగా శకుంతల ప్రశ్నించింది.

"బహుశా కావొచ్చు"

"భర్త ఓ వారం రోజులపాటు యింటి దగ్గరలేకపోయినా, అతడి కంటె అందమైన వాడూ బలంగల వాడూ పరాయి పురుషుడు మరెవడైనా కనపడినా - చాలామంది స్త్రీలు వాళ్ళ వెంటబడ తారని, మీరు కథల్లో రాస్తున్నదంతా - నిజం అని నమ్మే రాస్తున్నారా?"

"నేను నమ్మనిది ఏమీ రాయను" - ప్రసాద్ సగర్వంగా అని, గడ్డాన్ని అరిచేతితో రుద్దుకున్నాడు.

"మీరు రాసిన ఓ కథలో భర్త పది రోజులు యింటి దగ్గర లేకపోతే, పొరుగింటి యువకుడితో ఓ స్త్రీ లేచిపోతుంది. దానిక్కారణం - ఆమె శరీరంలో పుట్టిన విపరీతమైన ఉష్ణమేనని రాశారు. స్త్రీ మానసిక తత్వం అలాంటిదే అని నమ్ముతున్నారా?"

"తప్పకుండా! లేకపోతే నీబోటి చలికుండలు కొన్ని నిద్దరలో జామకాయలు కోసి తృప్తిపడతాయ్"

శకుంతల అక్కడి నుంచి గిర్రున తిరిగి వెళ్ళబోయేసరికి, ప్రసాద్ గట్టిగా పిలిచాడు.

"ఒక్కమాట! యదార్థం చెపుతావనుకుంటాను. నేను దాదాపు నెల'రోజుల నుంచీ యింటి దగ్గర లేనుకదా - నీకు... ఆ సంబంధమైన వుద్రేకం, వాంఛా కలగలేదా?"

"కలిగింది"

నేలను గట్టిగా కాలితో తన్ని ప్రసాద్ ఎగిరి నుంచున్నాడు.

"అయితే నువ్వెందుకు వూరుకున్నావ్? సంఘం, నీతి.. అంతే, కాని నా కథానాయికలు నిజాయితీ - సాహసం వున్నవాళ్ళు. అందువల్ల లేచిపోయారు. నీ మాదిరిగా మానసిక వ్యభిచారం చేయలేదు"

"నా జవాబు వినకుండా మాట్లాడేస్తున్నారు"

'అయితే నీ జవాబేమిటో చెప్పు. ఆ వుద్రేకం, వాంఛా కలిగింది. కాని వూరుకున్నావ్? కారణం?'

శకుంతల కంపిస్తూన్న శరీరంతో, వణుకుతున్న పెదిమల్తో అతడి దగ్గిరకు చరచర వచ్చి

అన్నది.

"మీరనే.. ఆ వుద్రేకం.. వాంఛా కలిగింది. కాని ఒక్కమాట. నాకు ఆకలయినప్పుడు... ఆలస్యం అయినా వండుకు తిన్నాను. కాని ఏ పచ్చిగడ్డో ఎండుగడ్డో తిని అది చల్లార్చుకునేందుకు ప్రయత్నించలేదు! దాహం కలిగింది, బావిలో నీళ్లు తెచ్చుకుని తాగాను. కాని అందుబాట్లో వున్నదని సైదు కాలవలో నీళ్లు తాగలేదు. అదేవిధంగా ఆ కోర్కె, వాంఛా కలిగినా అది తీర్చుకునేందుకు నేను ఎక్కడికో పరిగెత్తనవసరం లేదు"

ప్రసాద్ రెప్పవాల్చకుండా ఆమె వంక ఓ క్షణం చూసి గిర్రున తిరిగి వెళ్ళి మంచం మీద కూర్చున్నాడు. అతడికి మెదడు తల పెంకును ఛేదించుకుని బయట పడేందుకు ప్రయత్నిస్తున్నట్టు తోచింది. వణుకుతున్న గొంతుతో, దృష్టిని నేల మీద వుంచి అన్నాడు.

"అయితే యింత కాలంగా నేను రాస్తున్న కథల్ని గురించి – నీ అభిప్రాయం చెప్పకుండా ఎందుకు వూరుకున్నావ్?"

"మీరు రాసేదంతా యదార్థమని మీరు నమ్ముతున్నట్టు నాతో అనలేదు"

"అయితే నీ వుద్దేశం నేనో అబద్ధాలకోరుననీ, చెప్పేది ఒకటీ, చేసేది వొకటీ అనీ – అంతేనా?"

శకుంతల బలవంతంగా చిన్న నవ్వు తెచ్చుకుని – "కాశీరామేశ్వర మజిలీ కథలు యదార్థాలని ఆ రాసిన వాళ్ళు కూడా అనరు. ఆ విధంగానే, మీరు ఏదో మజిలీ కథలు రాస్తున్నారనుకున్నాను"

"అయితే – నా కథల్లోని స్త్రీలు ఆ విధంగా అన్నిటినీ ధిక్కరించడం... అదంతా, నేను ఏ ఆదర్శం లేకుండా, వఠినే రాస్తున్నానని అనుకున్నావన్న మాట!"

శకుంతల మంచం దగ్గిరకు వచ్చి, అతడి పక్కను నుంచుని, తల నిమురుతూ, అన్నది.

"మీరు రాసేదంతా – మీరు యదార్థమని నమ్ముతున్నారని నేనెలా అనుకునేది? మచ్చుకు – మీ రేవతి అన్న కథానాయిక, భర్తలో ఏ లోపం లేకపోవడం, ఓ లోపంగా భావించి లేచిపోతుంది. అదీ మీరు నమ్మే రాశారా?"

ప్రసాద్ తలయెత్తి ఆమె కళ్లల్లోకి చూస్తూ, "అవును! నూటికి నూరుపాళ్ళు నమ్మి, ఆదర్శ స్త్రీ అనే రాశాను" – అన్నాడు.

"కాని, నేను అలా అనుకోలేకపోయాను, చూడండి! మీరు అన్ని విధాలా ఆరోగ్యంగానే వుంటిరి. అన్నం తింటూ వుంటిరి! కాఫీ, సిగరెట్లూ వరస తప్పకుండానే సేవిస్తూంటిరి! ఆఖరికి బట్ట కట్టుకుని కూడా తిరుగుతూంటిరి..."

"ఆపు.....హుఁ!" – ప్రసాద్ బిగ్గరగా అరిచి మంచం మీది నుంచి వుద్రేకంగా లేచాడు.

"నా కథల్ని చదివి, స్వేచ్ఛ కోసం లేచిపోయిన స్త్రీ కూడా ఒకవేళ పొరపాటు అర్థంచేసుకున్నానేమో అని – దిండులో తలదూర్చి వెక్కి వెక్కి ఏడ్చింది. నువ్వు నా రచనల్ని కాశీమజిలీ కథల్తో పోలుస్తున్నావ్. అయితే నేనెందుకు రాయాలి? ఎవరి కోసం రాయాలి?"

"అది మీరు ఆలోచించుకోవలసిన విషయం"

శకుంతల ఆ మాట అని, మంచం మీద చెదిరిపోయిన దుప్పటి సరిచేసేందుకు వంగింది.

హఠాత్తుగా ఆమెకు ప్రసాద్ వీధి తలుపు తెరిచిన శబ్దంతోపాటు, అతడు గొంతు బద్దలయ్యేట్టుగా అరవడం వినబడింది.

"నేను రాయను! ఏమీ రాయను! ఎందుకు రాయాలి? తన భార్యలోనే ఆ కదలికా, వేడీ కలిగించలేని రచయిత రాయడం ఎందుకు? నేను ఏమి రాసినా నువ్వు లేచిపోవు! దాన్ని చూసి లోకం నన్ను హేళన చేస్తుంది. మాటలకూ – ఆచరణకూ తేడా వున్నదంటుంది. ఉహుఁ! రాయను! రా...య....ను!..."

ప్రసాద్ గడప మీద నిస్పృత్తువగా కూలబడి, వీధికేసి చూస్తూ ఓ ఐదు నిమిషాలు గడిపాడు.

శకుంతల మంచం దగ్గిరే నిలబడి అతడికేసి అదుర్దాగా చూస్తోంది.

ప్రసాద్ వీపుతో తలుపు చెక్కను ఓ మారు గట్టిగా కొట్టి, కాళ్ళతో ఎదురుగా వున్న తలుపు చెక్కను ఓ మారు తన్ని, "రాయను! ముమ్మాటికీ రాయను! ఫ్రాయిడ్ మీద వొట్టు! అస్త్ర సన్యాసం! ఫౌంటెన్ సన్యాసం..." – అంటూ జేబులోని కలాన్ని వేగంగా బయటకు లాగి, విసురుగా రోడ్డు మీదకు వేశాడు.

అతడిలో ఓ అగ్నిపర్వతం బద్దలైనట్టయింది. పెదాలు గట్టిగా కొరుక్కుంటూ, కాళ్ళతో తలుపు చెక్కని గట్టిగా తంతూ, తను పారేసిన కలం రెండుగా భిన్నమై, దుమ్ములో పొర్లాడడాన్ని చూస్తూ కూర్చున్నాడు. ఆ రోడ్డు మీద అనేకులు అటూ – యిటూ నడుస్తున్నారు. కాని ఎవరూ దాన్ని గమనించినట్టే లేదు.

'అవును! రెండు సంవత్సరాల్నుంచీ వెంటపెట్టుకు తిరిగిన నాకే దాని అవసరం లేకపోతే – మరొకరికి ఎందుక్కావాలి? అంతే! అది అక్కడే ఎండకు ఎండి, వానకు తడిసి దుమ్ములో కలిసిపోతుంది!'

ప్రసాద్ చూపు, ఎదురుగా రోడ్డు మీది దుమ్మును, కాళ్లతో లేపుకుంటూ వస్తున్న ఓ కుర్రాడి మీద పడింది.

'బహుశా యీ భావిపౌరుడు దాన్ని తీసుకోవొచ్చు! వుద్ధరించవచ్చు! నాకన్న అతడు దాన్ని తీవ్రంగా, బలంగా వుపయోగించుకోవచ్చు!' అని గొణిగాడు.

ఆ కుర్రాడు ఆ ఫౌంటెన్ పెన్ పడిన చోటు దగ్గిర ఆగి దాన్ని చేతులోకి తీసుకున్నాడు.

ప్రసాద్ కళ్ళు పెద్దగా చేసి, కుతూహలంతో, అటు చూస్తున్నాడు.

"పాళీ దబ్బనంలా మొద్దుబారింది. గొట్టాం పగిలిపోయింది. ఛీ!"

ఆ కుర్రాడు దాన్ని రోడ్డు పక్కకు విసిరి చకచకా నడచిపోయాడు.

"పాళీ దబ్బనంలా మొద్దు బారటం కాదు? రోకలి లాగా బండ బారింది. గొట్టాం పగలడం కాదు – నుగ్గనుగ్గయిపోయింది. మరి నేను... హుఁ! ఇష్! హుఁ!" అంటూ తల పీక్కున్నాడు.

శకుంతల దొడ్డి వాకిలి నుంచి డాక్టరు కోసం పరిగెత్తింది.

*

*(అభిసారిక మాసపత్రిక : జనవరి, 1950)*